"యింతకూ ఆ సీతాదేవి అందంగా వుందా?" అన్నది త్రిజట.

"ఏమంటామో ఏమిటో ఆఖరికి తోక కూడా లేదు. జడ మాత్రం తోక కంటే పొడవుగా వుంది. యీ మాత్రానికే ఆ రాముడు మా కిష్కింధలో సగం మందిని వెధవ ముండల్ని చేశాడు యుద్ధానికి తీసుకు వెళ్ళి" అని ముక్కూ మూతీ విరిచింది తోక తిప్పుకుంటూ ఒక కోతి నాతి.

"మీ మహారాణి తారాదేవిగారు మొగుడు చచ్చిన మరునాడే మందు కొట్టి మరిదిని పెళ్ళి చేసుకుందిగా. యథారాణీ తథా వానరీ" అంది త్రిజట.

"ఔను మీ రాక్షసుల్లోనూ బహు భర్తృత్వం బహుభార్యాత్వం వున్నయిగా. మీ శూర్పణఖ మరో వివాహం చేసుకోవాలనబట్టేగా యీ యుద్ధం" అని ఎత్తిపొడిచింది కోతి నాతి.

"సరేనమ్మా దానికి నేనేమనటం లేదు. అసలు యీ పాతివ్రత్యమేమిటీ ఆ సీతకి అని. నరమాంసం రెండు పూటలు తింటేనే వెగటు పుడుతుందిగదా—మనిషి అయిన మొగుడుతో కలకాలం కాపరం చెయ్యటం ఎట్లా చెప్పు. విసుగు పుట్టదూ. ఆ.... అయినా ఆడవాళ్ళు మరీ బరితెగించారు. ఏ ఆడదైనా ఒక్క మగవాణ్ణి నమ్ముకుని వుండటం అంటే జరిగేపనేనా? ఏమిటో కాలం యిలా తగలడ్డది. మా అమ్మగాని మా అమ్మమ్మగాని ఒక్క మొగుడికి కాపరం చెయ్యలేదు.... అపును మా రాక్షస స్త్రీలకు వున్నట్లు అందమైన కోరలు కూడా లేవుటగా సీతకి. కోరాకోరా తగుల్తుంటేనే కోరుకున్న మగవాడు కుక్కలాగా పడుంటాడు" అన్నది త్రిజట.

"నిజమే యీ దిక్కుమాలిన ఆచారాలు మనుషులకేగాని మా జంతువులకు లేవు సుమా. చూద్దాం కాలం మారదా? ఈ పాతివ్రత్యం పోదా" అన్నది వానరి.

* * *

"ఏమే అంధకీ ఎక్కడ నుంచి నీ రాక హస్తిన నుంచేనా? అంతా బాగున్నారా?" అంది ఒక గ్రామ్య వనిత.

"ఔనే హస్తిన నుంచే వస్తున్నాను. ఆ దిక్కుమాలిన రాజధానిలో జరగకూడని పనులు జరిగిపోతున్నయ్యనుకో. గంగమ్మ రెండో పెళ్ళి చేసుకుంది. అట్లాగే సత్యమ్మ రెండో మనువాడిందా? సరే వాళ్ళ కోడళ్లు మొగుడు చచ్చాక మారుమగని దగ్గర బిడ్డల్ని కన్నారా? యిప్పుడు ఆ స్వేచ్ఛంతా నశించి పోయిందనుకో ఆడదానికి. అయిదుగురు మొగుళ్ళను చేసుకున్నా గొంతెమ్మ కోడలు ఏడాదికి ఒక్క మొగుడుతోనే వుండాలిట! అలా అని వాళ్ళల్లో వాళ్ళే కూడపలుక్కున్నారట. యీ కవిగాళ్ళకు కూడా బుద్ధిలేదనుకో. ఒకాయన ఆ కుంతెమ్మ కోడల్ని మహా పతివ్రత అనటం నా చెవుల్తో నేను విన్నా. ఆవిడేం సీతా, సావిత్రా? ఎట్లాగూ మనకు మాతృస్వామ్యం వుండనే వుండె. మగాడు చెప్పినట్టు వినాలని ఏ ఆడదయినా ఏనాడయినా అనుకుందా? యిదుగో ఇప్పుడు అలాటి పాడుకాలం వచ్చిందనుకో. కాలం మారదా అని యిటు వచ్చాను. యీకళ్ళతో ఆ ఘోరం చూడలేక." అన్నది అంధకి.

ఆ మాటలకి గ్రామ్యవనిత ఆశ్చర్యపడి ఏ మనాలో తోచక తికమకపడి ఆలోచించి, "అయితే, అంధకీ మొగాడి మాట వినటం తప్పంటావా ఏమిటి?" అంది నసుగుతూ.

"ముమ్మాటికీ తప్పు. శివుడు మాట గంగమ్మవిన్నదా, మా తాతమాట అమ్మమ్మ విందా? మా వంశంలో మగవాడిమాట వినే ఆచారమేలేదు. యథా రాజా తథా ప్రజా. యిప్పుడేమిటో మగవాడిమాట వినటం గొప్పయిపోయింది. ఆ గుడ్డిరాణి. యీ కుంటిరాణి చేసేవన్నీ చేసేసి పాతివ్రత్యం అంటూ వుంటారు మధ్య మధ్య. పాడు కాలం వచ్చిందనుకో. అనకూడదుగాని ఆడది బిడ్డల్ని కంటున్నప్పుడు తండ్రి ఎవడైతేనేం. నిమిత్తమాత్రపు ప్రాణి. నిన్నటి వరకూ రాజకుటుంబమూ అంతేగా. పోనిద్దూ పాడు గొడవ. నీ మొగుళ్ళిద్దరి మాటా నువ్వు వింటున్నావా?" అన్నది అంధకి.

"యిప్పటివరకూ వింటున్నానే. నీమాట విన్నాక యిహ చస్తే విను" అన్నది ఆ గ్రామ్య వనిత.

"ఏమిటో ఆడవాళ్ళకు మరీ తెగులు వచ్చిందనుకో. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తగలెట్టేసుకుని మగాడు దొరకడన్నట్టు వాడి మాట వినటం, వాడొక్కడేనననటం. అందులో ఏముందో నాకర్థం కావటంలేదు. కాలం మారదా అని చూస్తున్నాను" అన్నది అంధకి.

* * *

"వైశాలీ! తక్షశిల నుంచి ఎప్పుడు వచ్చావే? విద్య పూర్తయిందా?" అన్నది శ్రీలేఖ.

"పూర్తయింది" అన్నది వైశాలి.

"వివాహం చేసుకుంటావా లేక సన్యాసం తీసుకుంటావా?" అంది శ్రీలేఖ.

"ఏం వివాహం పోనిద్దూ. ప్రస్తుతం సన్యాసిని పనే హాయిగా వుంది. పట్టుబీవరం కట్టుకుంటే పాపాలు దాచుకోవచ్చు. భిక్షా పాత్ర ధరించి పాత్రా పాత్ర భేదం మరచి ప్రేమ భిక్ష కామభిక్ష కూడా కోరవచ్చు. బౌద్ధారామాల్లో వున్న సుఖం యిళ్ళల్లో వుంటుందంటావా? గొంపాల్లో వుండే సౌఖ్యం కొంపల్లో వుంటుందంటావా? నేను సుఖపడదల్చుకున్నానే శ్రీలేఖా. రాణులూ వణిక్ప్రముఖులూ యీ విధంగా ప్రేమ విపణిని సన్యాసం పేర ప్రోత్సహిస్తుంటే 'తిలా పాపం తలా పిడికెడు' అని మనం కూడా కాస్త సుఖపడదాం." అన్నది వైశాలి.

"ఆడవాళ్ళందరూ నీలాగాఆలోచిస్తే బౌద్ధారామాలన్నీ లంజల దిబ్బలు అవుతయ్యేమోనే" అని అనుమానం వెలిబుచ్చింది శ్రీలేఖ.

"బుద్ధం శరణం గచ్ఛామి. ఇక్కడ బుద్ధం అంటే బుద్ధికి తోచినదని నేను అర్థం చెపితే నువ్వు తర్కించకు శ్రీలేఖా. నువ్వు భవిష్యత్తుగురించి ఆలోచిస్తున్నావు-నేను వర్తమానాన్ని అనుభవిస్తాను. బౌద్ధారామంలోవుండే సుఖం బయట ఎక్కడ వుంటుందే పిచ్చిదానా. మహాయాన బౌద్ధం వచ్చిన తరువాత వ్యభిచారం ఎక్కువ అయిందంటావా? ధర్మం శరణం గచ్ఛామి. కాదూ కూడదూ ఆడవాళ్ళందరూ సన్యాసానికి అలవాటుపడి సుఖం మరిగి నాశనం అవుతారంటావా- కావచ్చు. ప్రస్తుతం మాత్రం "సంఘం శరణం గచ్ఛామి." అన్నది వైశాలి.

శ్రీలేఖ నిట్టూర్చి "స్త్రీ యీ విధంగా ఆలోచిస్తే యిహలోకం ఏమయిపోయేటట్టు. సరేనే వైశాలి! పాడుకాలం వచ్చిపడ్డది. కాలం మారదా అని ఎదురుచూట్టం తప్ప గత్యంతరం లేదు!" అన్నది శ్రీలేఖ.

* * *

"ఎవరే సవితా ఆ రాజారామమోహన రాయ్. బెంగాల్లో పుట్టినవాడేనా? అసలు బ్రాహ్మడేనా? వీడికేం పోయే కాలం వచ్చింది. సహగమనం వద్దంటాట్ట. యింత కన్నా మహాపాపం వుందా? భర్త చచ్చి

## లాటరీ

రోడ్డు మీద
'ఎర' వేసిన
రూపాయి
ఆశపడి వేలమంది
పైసలు పోగొట్టుకొంటే
దక్కేది ఒక్కడికే
అదీ అరవై పైసలే!

—అరతీమూర్తి, ఉషాకిరణ్

# కాలం మారదా?

లత



పోతే భంగుతాగి భగభగలాడి పేరంటాల వ్వాలి కాని బ్రతికుండటం ఏమిటే! మహా పాపం కాదూ?" అంది అన్నాదీది.

"అలా అనకూడదు దీదీ. ఆయన చాలా గొప్పవాట్ట. మన ఆడవాళ్ళు అర్ధంతరంగా చావకుండా రక్షిస్తున్న మహానుభావుడు. తప్పమ్మా అలాఅనకూడదు లెంపలేసుకో" అంది సవిత. "బాగానే వుంది నీ సమర్థింపు. రేపు నీ మొగుడు చస్తే నువ్వు సహగమనం చెయ్యవా ఏమిటి?"

"చిన్నవాడైన నా మొగుడు ఎందుకు చావాలి. నీ ముసిలి మొగుడు చస్తే నువ్వు చేద్దువుగాని సహగమనం!" అని ఎదురు తిరిగింది సవిత. ఆ మాటకి అన్నాదీది తగ్గి- "పాడుకాలం వచ్చిపడ్డది. కాలం మారదా అని చూస్తున్నా." అని వెళ్ళిపోయింది.

*　　*　　*

"హలో మిసెస్ రావ్ ఎలా వున్నారు?" అంది వృద్ధ కన్య రాధ.

"బాగానే వున్నాను రాధాదేవీ. మీరు యిహ పెళ్ళి చేసుకోరా ఏమిటి?" అన్నది మిసెస్ రావు.

"పెళ్ళి! ఎందుకంటీ అది. అదే ఎందుకూ అంట? మనలో మాట పెళ్ళి చేసుకుని మీరు సుఖపడుతున్నారా? నాకు తెలియక అడుగుతానంటే. నాకు పెళ్ళంటే పరమ బోర్. యీ యిరవయ్యో శతాబ్దంలో వచ్చిన సామాజిక మార్పులు ఏ కాలంలోనూ రాలేదనుకోండి. అయినా సామాజిక స్పృహలేని మొగుణ్ణి ఏం చేసుకోవాలండీ. మొద్దులు. నేను రైటర్ని. ఉద్యోగం చేసుకుంటున్నాను. నా ఒక్క పొట్టా గడవదాండి పెళ్ళిచేసుకోకపోతే. అయినా ఎందుకొచ్చిన పెళ్ళి లెండి? వీరేశలింగం పుణ్యమా అని వెధవముండలు లేకుండా పోయారుగాని మాలాటి వృద్ధకన్యలు లేకుండా పోవటానికి మరోసంఘసంస్కర్తపుట్టాలంటీ. నాకు తెలియక అడుగుతాను ప్రధాన మంత్రి స్త్రీ అయివుండగా స్త్రీకి పెళ్ళి దేనికండి" అని ఆకు నందకుండా పోకకి పొందకుండా మాట్లాడి వెళ్ళిపోయింది వృద్ధకన్య రాధ.

మిసెస్ రావు నిట్టూర్చి పాడుకాలంవచ్చి పడింది- కాలం మారదా అనుకుంది.

కాని ఆ కాలం కించిత్తు కూడా మారలేదు. తరతరాలుగా, యుగయుగాలుగా ఎన్ని ఆచారాలు మారినా, ఎన్ని సంస్కరణలు జరిగినా, పాడు కాలం మారలేదు. ఆడకాలం అంతకంటే మారలేదు. అర్థాలే వేరయినా ఆడవారి మాటల్లో పాడుకాలం మారబోదు. మంచి కాలం రాబోదు.

త్రిజట, కోతి నాతి, కృతయుగంలో అయితే, అంధకీ, గ్రామ్య వనితా ద్వాపరంలో, కలియుగంలో వైశాలీ, శ్రీరేఖ, సవిత, అన్నాదీదీ, మిసెస్‌రావు, రాధ. ఆడ కాలం మారదు. అది అంతే!